సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 9, ఆగస్టు, 2023



ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు

అంగవైకల్యం ప్రతిభకు ఎప్పుడూ అడ్డు కాదని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. -8లో



పీఎం స్వ నిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి

వీధి విక్రయదారులు పీఎం స్వ నిధి కింద మంజూరయ్యే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌డీఎం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1100	రూ.1280
రెండోరకం	రూ.940	రూ.1090



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 258 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	480
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 56.60 కిలోలు

న్యూస్‌రీల్

10న నులిపురుగు నివారణ మందు పంపిణీ

రాయచోటిటౌన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న జాతీయ నులిపురుగు నివారణోత్సవంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేది మధ్యాహ్నం భోజనానంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జాతీయ నులిపురుగు నివారణోత్సవంలో భాగంగా వైద్య ఆరోగ్య, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

నేడు కుడి కాలువకు నీటి విడుదల

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారులతో కలిసి నీటిని విడుదల చేయనున్నారు. ఈ మధ్య కాలంలో కుడి కాలువలో మట్టి, జమ్ము పేరుకుపోవడంతో నీటి ప్రవాహం తగ్గింది. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి జేసీబీలతో సుమారు నెల రోజల పాటు కాలువలో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని తొలగించి కుంటలకు ,చెరువులకు నీటిని సరఫరా చేయనున్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పిద్దాం



గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై సమీక్ష నిర్వహిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

మదనపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీపీఓ మాట్లాడారు. 5 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న వారు 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతూ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. 10, 12 తరగతులు ఫెయిల్ అయిన విద్యార్థులకు మళ్లీ అడ్మిషన్ కల్పించి చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. వలంటీర్ల వద్ద మొబైల్ యాప్‌లో విద్యార్థుల వివరాలు తీసుకుని సర్వే నిర్వహించాలన్నారు. బడి బయట పిల్లలు పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మృతి చెందినవారి వివరాలు, బయటకు వెళ్లిన పిల్లలపై ఆరా తీయాలన్నారు. వందశాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ భానుప్రసాద్, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రు,1,50,232లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. పులివెందులకు చెందిన కాంట్రాక్టర్ ఓటికుంట గంగాధర్ నాయుడు, చంద్రకళలు తమ కుమార్తె నందిని జన్మదినం సందర్భంగా విరాళం అందజేశారని చెప్పారు.అలాగే కొండాపురం మండలంల పొట్టిపాడు గ్రామానికి చెందిన వీరాపురం ప్రతాపరెడ్డి ఆయన సతీమణి లక్ష్మీలు రు.50,116లు అందజేశారని చెప్పా రు.ఈసందర్భంగా దాతలకు స్వామి వారి చిత్ర పటం, తీర్థప్రసాదాలను అందజేసినట్లు చెప్పారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి కృషి

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా మండలస్థాయిలో ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌లు) అభివృద్ధికి కృషి చేయాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం కడపలో డీసీసీ బ్యాంకు అధికారులు, పీఏసీఎస్ డెవలప్‌మెంట్ కమిటీతో చర్చించారు. ప్రతి పీఏసీఎస్ ఆస్తులు ఏంత.. అప్పులెంత అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా పరిధిలో ఎంతమందికి లోన్లు ఇచ్చారు. రికవరీ ఎలా ఉందనే అంశాలపై కూడా చర్చించారు. నష్టాలలో ఉన్న పీఏసీఎస్‌ల గురించి కూడా ఆరా తీశారు. వాటిని లాభాల పట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.సమావేశంలో డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, ఓఎస్‌డి గుర్రప్ప పాల్గొన్నారు.

ప్రజల కల నెరవేరుతున్న వేళ!

వాటర్ గ్రిడ్ రెడీ!

- పూర్తయిన సర్వే...
- గండికోట ప్రాజెక్టు నుంచి నేరుగా మామిళ్లవారిపల్లెకు పైప్‌లైన్
- 514 కి.మీ ప్రధాన పైప్‌లైన్, 2,981 సరఫరా లైన్



వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్ సర్వే

బి.కొత్తకోట: అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల ప్రజలకు శాశ్వత మంచినీటి సరఫరా కల నెరవేరనుంది. దశాబ్దాలలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరైడ్ సమస్య ఇక మటుమాయం కానుంది. అవును.. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వాటర్‌గ్రిడ్ పథక స్వరూపం సిద్ధమైంది. దీనికి సంబంధించి సమగ్ర సర్వేను సదరు కాంట్రాక్టు సంస్థ ఇటీవలే పూర్తి చేసి పథకం నిర్మాణం ఎలా చేపట్టేది రూపకల్పన చేసింది. ఈ నెలాఖరులో పనులు చేపట్టేందుకు చర్యలు వేగవంతం చేసింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు కూడా చర్యలు మొదలుపెట్టారు. వైఎస్సార్ కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు తరలించి నీటి శుద్ధీకరణ చేసి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించే ఈ పథకాన్ని అన్నమయ్య జిల్లాలోని నాలుగు, చిత్తూరుజిల్లాలోని ఒక నియోజకవర్గంలో అమలు చేసేందుకు ప్రభుత్వం రూ.2,400 కోట్లతో మంజూరు చేసింది.

గండికోట నుంచి నీటి తరలింపు..

గండికోట జలాశయం నుంచి కృష్ణా నీటిని పైప్‌లైన్ ద్వారా వెలిగల్లు ప్రాజెక్టులోకి, అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా గుర్రంకొండలోని మామిళ్లవారిపల్లె వరకు పైప్ లైన్ వేసి నీటిని తరలించాలని మొదట నిర్ణయించారు. అయితే తాజాగా నిర్వహించిన సర్వే ప్రకారం...గండికోట జలాశయం నుంచి పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, పులివెందుల, గండి మండలాలు, రాయచోటి నియోజకవర్గంలోని వెలిగల్లు, కొర్లకుంట, నూలివీడు, గాలివీడు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, కలిచర్ల మీదుగా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలంలోని మామిళ్లవారిపల్లెలో నిర్మించే ట్రీట్‌మెంట్‌ప్లాంటుకు నేరుగా పైప్‌లైన్ ద్వారా నీటిని తరలిస్తారు.

ప్రధాన పైప్‌లైన్ దూరం :	514 కి.మీ
నీటి పంపిణీ పైప్‌లైన్ :	2,981 కి.మీ
ప్రధాన పైప్‌లైన్ సామర్థ్యం:	1.4 డయా మీటర్లు
ట్యాంకుల నిర్మాణానికి :	రూ.454 కోట్లు
ప్రధాన పైప్‌లైన్ :	రూ.1,000 కోట్లు
మొత్తం నిర్మాణ వ్యయం:	రూ.1,825.68కోట్లు

మండలాలకు నీటి తరలింపు ఇలా..

ఐదు నియోజకవర్గాలకు చెందిన 27 మండలాలకు కృష్ణా జలాలు తరలించే పైప్‌లైన్ ప్రధాన, సరఫరా మార్గాలను నిర్ణయించారు. గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లెలో ప్రధాన నీటి శుద్ధి కేంద్రం నిర్మిస్తారు. ఇక్కడినుంచి ప్రధాన పైప్‌లైన్ తంబళ్లపల్లె మండలంలోని కోటకొండకు వస్తుంది. ఇక్కడ పైప్‌లైన్ రెండుగా వీడి కుడివైపు తంబళ్లపల్లె, ఎడమవైపు కురబలకోట మండలం ముదివేడు మీదుగా అంగళ్లకు ప్రధాన పైప్‌లైన్ సాగుతుంది. అంగళ్లు నుంచి కుడివైపు పైప్‌లైన్ బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్ద తిప్పసముద్రం మండలాలకు వెళ్తుంది. ఎడమవైపు పైప్‌లైన్ మార్గం నేరుగా అమ్మచెరువుమిట్ట నుంచి మదనపల్లె బైపాస్‌మీదుగా గంగమ్మగుడి నుంచి చిత్తూరుజిల్లాలోని పుంగనూరుకు పైప్‌లైన్ వెళ్తుంది. పుంగనూరు నుంచి రామసముద్రం, సోమల మండలాలకు పైప్‌లైన్ వెళ్తుంది. గంగమ్మగుడి నుంచి నిమ్మనపల్లె, చౌడేపల్లె మండలాలకు పైప్‌లైన్ వెళ్తుంది. మామిళ్లవారిపల్లె శుద్ధికేంద్రం నుంచి తుస్సావాండ్లపల్లె మీదుగా పెద్దమండ్యం మండలానికి ఒకపైప్‌లైన్ వెళ్తుంది. ముదివేడు నుంచి మదనపల్లె రూరల్ మండలానికి పైప్‌లైన్ వెళ్తుంది. మామిళ్లవారిపల్లె నుంచి గుర్రంకొండ, కలకడ, పీలేరు మండలాలకు, గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి వాయల్పాడుకు పైప్‌లైన్ నిర్మిస్తారు. కేవిపల్లె మండలంలో ఇప్పటికే తాగునీటి పథకం అమలులో ఉన్నందున వాటర్‌గ్రిడ్‌ను దీనికి అనుసంధానిస్తారు. ఈ ప్రధాన పైప్‌లైన్ నుంచి మండలాల్లో నీటి సరఫరా పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తారు.

664 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోత

సముద్రమట్టానికి 200 మీటర్ల ఎత్తులోని గండి జలాశయం నుంచి 664 మీటర్ల ఎత్తులోని మామిళ్లవారిపల్లెకు కృష్ణా జలాలను ఎత్తిపోస్తారు. దీనికోసం ప్రధాన పైప్‌లైన్ ప్రారంభమయ్యే గండికోట జలాశయం వద్ద ఒకటి, మార్గంలోని తొండూరు వద్ద, గండి వద్ద, తలముడిపి వద్ద, కోర్లకుంట వద్ద, నూలివీడు వద్ద, గాలివీడు, కలిచర్ల వద్ద ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తారు.

13.94 లక్షల జనాభాకు నీళ్లు

వాటర్‌గ్రిడ్‌తో జిల్లాలోని రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గాలు, మదనపల్లె, పుంగనూరు, రాయచోటి మున్సిపాలిటిలకు తాగునీటిని అందించే పనులను ఈ నెలాఖరులో ప్రారంభించనున్నారు. 27 మండలాల్లోని 5,336 పల్లెల్లోని ఇప్పుడున్న 13,94,757 మందికి ఇంటింటికి తాగునీటిని అందిస్తారు. ఈ జనాభాకు అవసరమైన 3.37 టిఎంసీల నీటిని గండికోట జలాశయం నుంచి తరలిస్తారు. కాగా మామిళ్లవారిపల్లె వద్ద నిర్మించే ట్రిట్‌మెంట్ ప్లాంట్‌కు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మదనపల్లె ఈఈ అబ్దుల్‌మతీన్ కలెక్టర్‌కు లేఖ రాశారు. భూ కేటాయింపు జరగ్గానే పనులు మొదలవుతాయి.

సీఎంకు రుణ పడి ఉంటాం



కరువు ప్రాంత ప్రజలకు శాశ్వత తాగునీరు అందించే వాటర్‌గ్రిడ్ మంజూరు చేసిన సీఎంకు రుణపడి ఉంటాం. పాదయాత్రలో ఈ ప్రాంత ప్రజలకు ఫ్లోరైడ్ సమస్యలు దూరం చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి –మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

పనులు ప్రారంభం



ఈనెలాఖరులో వాటర్‌గ్రిడ్ పనులు మొదలవుతాయి. సర్వే పూర్తయి, సమగ్ర నిర్మాణ నివేదిక సిద్ధమైంది. ట్యాంకులు, సంపులు నిర్మాణ డిజైన్ల పనులు జరుగుతున్నాయి. ఈ పనులయ్యాక ఇక క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ఈ పనులకుగానూ రివర్స్ టెండరింగ్‌తో ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయ్యింది. –ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం

రాయచోటిటౌన్ : రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకొంటూ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ మయానా జాకీయా ఖానం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని జమాలుల్లా బాషా దర్గాలో కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మజార్‌పై పూల చాదర్ సమర్పించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ప్రశాంతంగా ఉండాలని ఈ ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రార్థనలలో కుమారుడు మయానా ముషరఫ్ ఆలీఖాన్, అల్లుళ్ల కె. సాదక్ అలీఖాన్, కుమార్తెతో కలసి ప్రార్థనలలో పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

రాయచోటి: ఈనెల 9వ తేది ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కలెక్టర్ ఆవరణంలోని స్పందన హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని గిరిజన ప్రజా ప్రతినిధులు, గిరిజన ప్రభుత్వ ఉద్యోగులు, గిరిజన సంఘ నాయకులు, గిరిజన ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- ఫ్రైడే డ్రైడే తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య



సబ్‌యూనిట్ అధికారులతో సమీక్ష జరుపుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి మలేరియా సబ్‌యూనిట్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాధులు ప్రబలిన చోట ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్‌లు పర్యటించి వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్‌యూనిట్ అధికారులు వెక్టార్ కంట్రోల్‌యాప్ నిర్వహణ సక్రంగా జరిగేలా చూడాలన్నారు. ఇదేసమయంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కచ్చితంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పీహెచ్‌సిలో ఆర్‌డీటీ, ఎన్ఎస్‌ఐ, డెంగీ కిట్లు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పోగ్రాం అధికారులు, సబ్‌యూనిట్ అధికారులు ప్రతిమండలంలో సిబ్బందితో సమావేశాలు నిర్వహించి కాలానుగుణంగా వ్యాప్తిచెందే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని డీఎంఅండ్ హెచ్‌ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, ఐడిఎస్‌పిఓ రియాజ్‌బేగ్, డీఎన్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, జిల్లా సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయచంద్ర, స్వామదాస్, శ్రీని వాసులు, ఖలీల్, ముజీబ్,బాష తదితరులు పాల్గొన్నారు.

పునరావాస చర్యలు వేగవంతం

- మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి
- కలెక్టర్ గిరీషా పీఎస్



పునరావాస కల్పన కోసం మ్యాప్‌ను పరిశీలిస్తూ గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

ఓబులవారిపల్లె: మంగంపేట కాపుపల్లె, దళితవాడ, ఆరుంధతివాడ గ్రామాల ప్రజలకు అన్ని రకాల మౌళిక సదుపాయాలతో మెరుగైన పునరావాసం కల్పించనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం ముక్కావారిపల్లె పంచాయతీలో కాలుష్య గ్రామాల తరలింపుల లేఅవుట్‌లను కలెక్టర్ గిరీషా పీఎస్, సబ్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్ అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ కాలుష్య గ్రామాలకు అన్ని రకాల మొరుగైన మౌళిక సదుపాయలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన లే అవుట్ స్కెచ్‌ను వారు పరిశీలించారు. సమస్యాత్మకంగా ఉన్న భూములకు సంబంధించి స్వయంగా పరిశీలించి అధికారులకు మార్పులు చేర్పులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగంపేట కాలుష్య గ్రామాల తరలింపు చర్యలు వేగవంతం చేశామని, అన్ని రకాల సౌకర్యాలు, మౌళిక సదుపాయలతో మెరుగైన పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు ఇప్పటికే దాదాపు వంద ఎకరాల్లో భూములు సేకరించామని వెల్లడించారు. కమిటీ ఏర్పాటు చేసి అందరినీ కలుపుకొని పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో పునారావాసం కోసం ఏర్పాటు చేసిన స్కెచ్ గురించి వివరించి వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారు. గ్రామానికి సంబంధించి గుడి, ప్రత్యేక సచివాలయం, బస్సుషెల్టర్ ,ఆడిటోరియం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. రాజంపేట ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ విజయారావు సర్పంచ్ మినుగు సుధాకార్, పార్టీ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, పులపత్తూరి రామసుబ్బారెడ్డి, తల్లెం భరత్‌కూమార్‌రెడ్డి, వడ్డి సూబ్బారెడ్డి, మంగంపేట గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు కమ్మని భోజనం

- అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లకుండానే భోజన వసతి
- పదిరకాల సరుకులతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- పదిహేను కిలోల బ్యాగు ద్వారా డ్రై రేషన్ ఇంటికే అందజేత
- జిల్లాలో బాలింతలు, గర్భిణుల్లో హర్షం



కురబలకోటలో సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ (ఫైల్)

మదనపల్లె సిటీ: గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తూ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. వారిలో రక్తహీనత నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించింది. అందుకే వారికి సంపూర్ణ పౌష్టికాహారాన్ని ఇంటికే అందించాలని సంకల్పించింది. పది రకాల సరుకులను ప్రత్యేక సంచిలో వేసి ఆ కిట్‌ను నెలకు రెండుసార్లు ఇంటికే అందించే బృహత్తర కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తోంది.

బ్యాగులో పది సరుకులు

జిల్లాలో 1858 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు అందుతున్నాయి. లబ్ధిదారుల ఇళ్లకే కిట్లను 15 కేజీల బ్యాగులలో పది రకాల సరుకులు అందజేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అవస్థలు

గత ప్రభుత్వంలో ఇచ్చే అరకొర సరుకుల కోసం గర్భిణులు, బాలింతలు గంటల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. అక్కడ వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. నెలలు నిండిన గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. సరుకుల నాణ్యత కూడా బాగుండేది కాదు. తూకాల్లో తేడా వచ్చేది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గర్భిణులు,బాలింతలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చర్యలు చేపట్టింది. వారికి నాణ్యమైన సరుకులు పంపిణీ చేస్తోంది. నెలలు నిండిన గర్భిణులకు ఇళ్లకే తీసుకెళ్లి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు తాజాగా మరో అడుగు ముందుకేసి బాలింతలు, గర్భిణులందరి ఇళ్లకే పదిరకాల సరుకుల కిట్లు పంపిణీ చేస్తున్నారు. దీని కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారో లేదా తెలిసేలా ఫోటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఫలితంగా మహిళల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు :	11
అంగన్‌వాడీ కేంద్రాలు :	1858
గర్భిణులు :	10943
బాలింతలు :	10039

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో సరుకులు

బియ్యం	:	3 కిలోలు
కందిపప్పు	:	1 కిలో
పామాయిల్	:	500 ఎంఎల్
పాలు	:	2.5 లీటర్లు
కోడిగుడ్లు	:	25
అటుకులు	:	1 కిలో
రాగిపిండి	:	2 కిలోలు
బెల్లం	:	250 గ్రాములు
వేరుశనగచిక్కి	:	250 గ్రాములు
ఎండుఖర్జూరం	:	250 గ్రాములు

జగనన్న మేలు మరవలేం



ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఇంటి వద్దకే కిట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. గర్భవతి అయిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నాను. నా ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ సూచనలిస్తున్నారు. జగనన్న చేస్తున్న మేలును మరవలేం. -జి.శిరీష, గర్భిణి, తంబళ్లపల్లె

ఆడపడుచులకు అండగా...



ఆడపడుచులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారు. ఈ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం చాలా బాగుంది. ప్రస్తుతం కిట్ల రూపంలో పౌష్టికాహారం ఇవ్వాలనే నిర్ణయం హర్షణీయం. ఈ పౌష్టికాహారం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది. సరుకులు ఇంటికే అందించడం గొప్ప విషయం. -తిరుపాలమ్మ,బాలింత,కురబలకోట

పారదర్శకంగా పంపిణీ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్‌హోం రేషన్ (టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోంది. బాలింతలకు,గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని పది రకాల సరుకులతో కూడిన బ్యాగ్‌ను ఇంటివద్దకే అర్హులైన వారికి అందజేస్తున్నాం. -ధనలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ, అన్నమయ్య జిల్లా

ఆలిమ్‌కో క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

రాయచోటి అర్బన్: సామాజికన్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ సౌజన్యంతో కాన్పూర్‌కు చెందిన కృతిమ అవయవాల తయారీసంస్థ (ఆలిమ్‌కో) ద్వారా నిర్వహించనున్న సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయసంచాలకులు ఆర్.వి.క్రిష్ణకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 18న రాజంపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో,19న రైల్వేకోడూరు జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ప్రత్యేక సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు వివరించారు. అర్హులైన దివ్యాంగులకు అవసరమైన చేతికర్రలు, వాకర్లు, మూడుకాళ్ల చేతికర్రలు, చంకకర్రలు, వీల్‌చైర్‌లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ వీల్‌చైర్లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రైసైకిళ్లు, రోలేటర్స్, యంయస్ఐ కిట్స్, అంధులకు సంబంధించి చేతివాచ్, చేతికర్రలు, టచ్ ఫోన్, వాయిస్‌ఫోన్, యల్‌ఓగ్రాదస్, లేప్రోసికిట్స్, డైసీ ప్లేయర్స్, స్మార్ట్‌కెన్ తదితర కృత్రిమ అవయవములు అర్హులకు అందజేస్తామని వివరించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, భౌతిక అవసరాలను బట్టి సహాయ ఉపకరణాల వినియోగం తప్పనిసరి అయినవారికి సహాయ ఉపకరణాలు మంజూరు చేయబడతాయన్నారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని సచివాలయం సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హులైన వికలాంగులను గుర్తించి వారి దరఖాస్తులను పూర్తి చేయించాలన్నారు. వికలాంగులను ఆధార్,రేషన్‌కార్డు,సదరం సర్టిఫికెట్, రెండు ఫొటోలతో సహా శిబిరానికి హాజరయ్యేలా చూడాలన్నారు. అర్హులైన వికలాంగులంతా తమ సచివాలయం కార్యదర్శులు, వలంటీర్ల ద్వారా వైద్యశిబిరాలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

పౌరసరఫరాల గిడ్డంగి తనిఖీ



తూనికల పరికరాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గిడ్డంగిని కొలతలు, తూనికల శాఖ కడప అసిస్టెంట్ కంట్రోలర్ రవీందర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూనికల పరికరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తూకాలు సరిగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ప్రతి ఒక చౌక దుకాణానికి వందశాతం తూకాలు వేసి బియ్యం సరఫరా చేయాలని గోడౌన్ ఇన్‌చార్జికి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ ఇన్‌చార్జి మల్లికార్జున, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు షాపులో చోరీ



చోరీ జరిగిన బంగారు షాపు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని రోషన్ మజ్జీద్ సమీపాన గల యస్‌యూ కాస్టింగ్ మౌలింగ్ బంగారు షాపులో చోరీ జరిగినట్లు ఆ షాపు యజమాని ఖలీలుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి షాపు మూసి వేసి ఇంటికి వెళ్లి.. తిరిగి మంగళవారం రాగా డోర్లు తెరిచి ఉండటం చూసి షాక్‌కు గురైనట్లు తెలిపారు. లోపలికి వెళ్లి చూడగా 200 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సొంత డబ్బుతో వలంటీర్ సేవ



మంచినీటి సరఫరా కేంద్రం వద్ద పైపులైను పనులు చేయిస్తున్న వలంటీర్ సుగుణ

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో అనపగుట్టలోని ఉచిత మంచినీటి సరఫరా కేంద్రంలో పైపులైను దెబ్బతిని తాగునీటి నీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వార్డు వలంటీర్ సుగుణ స్పందించారు. తన సొంత డబ్బులతో పైపులైనుకు మరమ్మతు చేయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది. వలంటీరు సేవలను స్థానికులు కొనియాడారు.

ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదు



విభిన్న ప్రతిభావంతుడికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : అంగవైకల్యం ఎప్పుడూ ప్రతిభకు అడ్డుకాదని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అంగవైకల్యం ఉందనే విషయాన్ని మర్చిపోయి ఎన్నో విజయాలు సాధించిన గొప్పవారు ఉన్నారని పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్నమయ్య జిల్లా ఐఈ కోఆర్డినేటర్ జనార్దన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించడానికి కృషి పట్టుదల ఉంటే చాలని విభిన్న ప్రతిభావంతులు నిరూపించారని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే వారిలో ఉన్న ప్రతిభ వెలుగుచూస్తుందని జిల్లా ఎస్పీ గంగాధర రావు అన్నారు. ఉదయం విభిన్న ప్రతిభావంతుల క్రీడల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిని కరచాలనం చేసి అభినందించారు.

అన్ని విభాగాలలో రాణించాలి

విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలో రాణించాలని డీఈవో శ్రీరాం పురుషోత్తం సూచించారు. తల్లిదండ్రులు విభిన్న ప్రతిభావంతులను తక్కువ చేసి చూడకుండా మిగిలిన వారితో సమానంగా పరిగణించి, అన్ని రంగాలలో ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాలలో రాణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కౌన్సిలర్ ఫయాజ్ అహమ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాగి వైరు దొంగల అరెస్టు



పట్టుకున్న సొత్తు, నిందితులతో సీఐ, ఎస్‌ఐ

రాజంపేట రూరల్ : వివిధ మండలాలలో రాగి వైర్లు దొంగలించిన ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువ చేసే ఒక మోటార్, రాగి వైర్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కే పుల్లయ్య తెలియజేశారు. స్థానిక మన్నూరు పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎస్‌ఐ ఎం.భక్తవత్సలంతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని హేమాద్రివారిపల్లికి చెందిన బాలరాజు రామయ్య, నగిలి పెంచలయ్య అలియాస్ మగధీర, తాళ్లపాక రాజశేఖర్, తాళ్లపాక విజయకుమార్, తాళ్లపాక ప్రవీణ్, పెరూరి లక్ష్మీనరసయ్య కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లను దొంగలించేవారు. వాటిని విక్రయించి వచ్చిన నగదుతో జల్సాలు చేసుకునేవారు. ఇలాంటి వాటికి సంబంధించి మన్నూరు పీఎస్‌లో 3, చిట్వేలి లో 3, రైల్వేకోడూరులో 2, పుల్లంపేట పీఎస్‌లో 1 కేసు నమోదయ్యాయి. వారు విక్రయించగా మిగిలిన రూ.1.50 లక్షల విలువ చేసే 103 కేజీల రాగి వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ సొత్తును కొనుగోలు చేసిన కె బోయినపల్లికి చెందిన గుజిరి వ్యాపారి సింగమనేని చిట్టిని అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే మోటారు పంపు సెట్టును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్‌లు పోలి నందకుమార్‌రెడ్డి, సీ లక్ష్మీదేవి, ఎంవీ రమణ, సురేష్‌బాబు, పీసీలు పీ రమణ, యు సుదర్శనరాజు, హేమలత తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలపై వీడిన ఉత్కంఠ

- 19న జిల్లా కోర్టులో కౌంటింగ్
- ఫలితాలు సీల్డ్ కవర్‌లో అందజేయాలని హైకోర్టు ఆదేశం

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలపై హైకోర్టు తీర్పును మంగళవారం వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న న్యాయవాదులు కలలు ఫలించాయి. రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలపై మంగళవారం హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ తన తీర్పును వెలువరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భారత దేశ చరిత్రలో ఏ అడ్వకేట్ బార్ అసోసియేషన్‌లో ఇంత వరకు బతికున్న న్యాయవాదులను ఓటర్ లిస్టు నుంచి తొలగించడం ఎక్కడా జరగలేదని విస్తుపోయింది. వివిధ కారణాలు చూపి ఎన్ని సార్లు వాయిదాలు తీసుకుంటారని గౌరవ హైకోర్టు గట్టిగా మందలించింది. ఈనెల 19వ తేదీన కడప జిల్లా కోర్టులో అన్ని ఓట్లు కౌంటింగ్ చేసి (తొలగించిన ఓట్లతో కలిపి), గౌరవ హైకోర్టు వారికి 24వ తేదీ లోపు సీల్డ్ కవర్‌లో భద్రపరచి ఎన్నికల ఫలితాన్ని అందజేయాలని ఎన్నికల అధికారిని ఆదేశించడం జరిగింది. దీంతో ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు హైకోర్టు తెరదింపింది. రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో జరిగిన విషయాలను న్యాయవాది కె.ఎం.ఎల్. నరసింహులు తెలిపారు.

పీఎం స్వనిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి అర్బన్ : వీధి విక్రయదారులు పీఎం స్వనిధి కింద మంజూరయ్యే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఎల్‌డీఎం అధ్యక్షతన పీఎం స్వనిధి నిధుల వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి విక్రయదారులంతా దాదాపుగా వీలైనంత మేర నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మెప్మా పీడీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం స్వనిధులను ప్రతి వీధివిక్రయదారుడు పెట్టుబడిగా ఉపయోగించుకుని ప్రణాళికాబద్ధంగా వ్యాపారాలను నిర్వహించుకోవాలంటూ సూచించారు. నిధుల సద్వినియోగం ద్వారా వ్యాపారాభివృద్ధితోపాటు ఆర్థికాభివృద్ధిని సాధించాలంటూ సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ విక్రయదారులంతా లోనుకు కేటాయించిన జోన్‌లలో వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. అనంతరం పీఎం స్వనిధి నిధులను తీసుకుని క్రమం తప్పకుండా బ్యాంకులకు వాయిదాపద్ధతిలో రుణాలను తిరిగి చెల్లించి తిరిగి తీసుకున్న వీధివిక్రయదారులను, అందుకు సహకరించిన మెప్మా అధికారులు, ఉన్నతాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా రాయచోటి సియంయం అబ్బాస్‌అలీఖాన్, టీఈలు నాగరాజు, నారాయణరెడ్డి, మెప్మా సిఓలు రామయ్య, కళ్యాణ్‌బాబు, రమణమ్మ, ఆర్‌పిలతోపాటు వివిధ శాఖల బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం అన్నమయ్య జిల్లా నందలూరు గ్రామానికి చెందిన జీ విజయకుమార్ రెడ్డి, వసంత దంపతులు రూ.50,016 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ అర్చకులు వర్ధన్‌స్వామి మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జునస్వామి, సిబ్బంది కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టి రైతులపై దాడులు చేయిస్తారా?

- ముందస్తు పథకం ప్రకారమే అంగళ్లు, పుంగనూరు ఘర్షణలు
- పద్మశాలి కార్పొరేషన్, ఇరిగేషన్ డైరెక్టర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె : 40 ఏళ్ల అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తరమండి, కొట్టండి... నా కొడుకులను అంటూ అమాయక ప్రజలను, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి రైతులపై దాడులు చేయించారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేంద్రనాథ్, ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లెలోని ప్రెస్‌క్లబ్‌లో తంబళ్లపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అంగళ్లు, పుంగనూరులో టీడీపీ నాయకుల అరాచకాలు, అకృత్యాలపై విలేకరులతో మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పిచ్చలవాండ్లపల్లె ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కోర్టులో స్టే తెచ్చినందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు.. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు 15 మంది రైతులు అంగళ్లుకు వస్తే వారిపై దాడులు జరపడం టీడీపీ నాయకులకు తగదన్నారు. వారు ముందస్తు పథకం ప్రకారం కర్ణాటక, పీలేరు, పుంగనూరు, మదనపల్లె నుంచి టీడీపీ నాయకులు, కిరాయిగూండాలను తెప్పించుకుని అంగళ్లులో రైతులపై రాళ్ల వర్షం కురిపించారన్నారు. వారి దాడుల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జున్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రజల్లో ఉన్నటువంటి ఆదరణను చూసి ఓర్వలేక, ఎలాగైనా వారి ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతోనే టీడీపీ నాయకులు ఘాతుకాలకు పాల్పడ్డారన్నారు. తంబళ్లపల్లెను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీర్చిదిద్దుతుంటే... ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై అవాకులు, చెవాకులు పేలితే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు సహించేది లేదన్నారు. సోమవారం మదనపల్లెలో టీడీపీ మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. 20 ఏళ్లుగా ప్రత్యక్ష రాజకీయాల్లో గెలవని ఆయన ప్రజాదరణ మెండుగా కలిగిన తమ నాయకులను విమర్శించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఇప్పటి వరకు ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కోలేక ఓటమి పొందుతూనే ఉన్నారన్నారు. చంద్రబాబు తన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం వెళ్లి ఉంటే అంగళ్లు, పుంగనూరులో ఘర్షణలు జరిగేవి కావన్నారు. రెండు ప్రాంతాల్లోనూ పోలీసులకు, టీడీపీ నాయకులకు మధ్య జరిగిన ఘర్షణను వైఎస్సార్ సీపీకి ఆపాదించడం భావ్యం కాదన్నారు. సమావేశంలో అంగళ్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి, తంబళ్లపల్లె మండల ప్రత్యేక ఆహ్వానితులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శీలంవారిపల్లె నాగిరెడ్డి, రాజంపేట వైఎస్సార్ సీపీ జాయింట్ సెక్రటరీ మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ మరమ్మతులకు ప్రతిపాదనలు



విద్యాలయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాజంపేట రూరల్ : కేంద్రీయ విద్యాలయంలో ముఖ్యమైన మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పాఠశాలలో వైట్ వాష్ చేయించాలని కోరారు. అదే విధంగా బాలబాలికల మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. అలాగే పలు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రతిపాదనలు తయారు చేసి తన వద్దకు తీసుకురావాలని సూచించారు. విద్యాలయంలో ఉత్తీర్ణత శాతం చాలా బాగుందని, దీనిని ఇలాగే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, విద్యాలయ ప్రిన్సిపాల్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యబృందం

రాయచోటి టౌన్ : ప్రతి పేద వాడికి మెరుగైన వైద్యం అందించాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కలల సాకారంలో భాగంగా రాయచోటిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ రెక్టో వెజైనల్ ఫిస్తులా (మలం యోని ద్వారా బయటికి రావడం) వ్యాధితో బాధపడుతోంది. అసలే పేద కుటుంబం కావడంతో ఖరీదైన శస్త్ర చికిత్స చేయించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండేది. ఈ సందర్భంలో ఆమె మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలోని డాక్టర్ జీనత్ బేగంను కలసి వైద్యం పొందింది. దీంతో ఆమె సహచర డాక్టర్లతో సంప్రదించి ఇక్కడే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసింది. వెంటనే సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఏర్పాట్లు చేసి ఆమెకు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ రాయచోటిలో 50 పడకల ఆస్పత్రి ఉన్న స్థితి నుంచి 100 పడకల ఆస్పత్రి వరకు పెంచడంతోపాటు అందుకు కావాల్సిన భవన నిర్మాణాలు కూడా వేగంగా సాగుతున్నాయని చెప్పారు. దీంతో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అలాగే 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రతి పేదవాడికి వైద్యసేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో 150 పడకల ఆస్పత్రిగా మారితే మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్లు వెంకటశివ, డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండో విడత నాడు-నేడుపై సమీక్ష

రాయచోటి : రెండో విడత నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తెలిపారు. మంగళవారం రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో డీఈఓ తెలియపరిచారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఉన్న భువన విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పీలేరు, కలికిరి, కలకడ, వాయల్పాడు, కెవి పల్లె, గుర్రంకొండ మండలాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలన్నారు. అలాగే మధ్యాహ్నం రాయచోటి పట్టణం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్న ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, వీరబల్లి మండలాలలోని ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలని, సమావేశానికి ప్రధానోపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖాధికారులు, మండల ఫీల్డ్ ఇంజనీర్లు, కో-ఆర్డినేటర్లు, సిఆర్‌పీలు రికార్డులతో తప్పక హాజరు కావాలని డీఈఓ సూచించారు.

విద్యార్థిని అదృశ్యం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పొన్నూటిపాలెంకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని(16) కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అమ్మాయి తల్లి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యార్థిని సోమవారం కాలేజీకి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. కన్పించకపోవడంతో రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. కట్టుగుత్తపల్లెకు చెందిన బాలిక సోమవారం ఉదయం రాయచోటిలో సర్టిఫికెట్లు తెచ్చుకొంటానని వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..



మృతి చెందిన మల్లీశ్వరి

కేవీపల్లె : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నూతనకాల్వ పంచాయతీ దిన్నెవడ్డిపల్లెలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. చిన్నమండ్యెం మండలం సాకిబండకు చెందిన మల్లీశ్వరి (36) మల్లికార్జునతో వివాహం జరిగి, వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే భర్తతో విడిపోయి ఏడేళ్లుగా దిన్నెవడ్డిపల్లెకు చెందిన యల్లయ్యతో సహజీవనం చేస్తోంది. సోమవారం రాత్రి యల్లయ్య, మల్లీశ్వరి గొడవ పడ్డారు. ఏమి జరిగిందో తెలియదు కానీ మంగళవారం ఉదయం మల్లీశ్వరి మృతి చెంది ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా



గణేష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

వల్లూరు : ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిలో మునిగి కడప నగరం చిన్నచౌక్ పరిధిలోని నెహ్రూ నగర్‌కు చెందిన నల్లబల్లె గణేష్ (17) మృతి చెందినట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎలక్ట్రీషియన్ పని చేసి జీవనం సాగించే గణేష్ తనతోపాటు పని చేసే స్నేహితులు శివ మణి, వెంకటేష్‌లతో కలిసి సోమవారం సాయంత్రం సరదాగా గడపడానికి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వచ్చారు. శివమణి, గణేష్ ఈత ఆడడానికి పెన్నా నది నీటిలో దిగారు. కొద్ది సేపటికి శివమణి బయటికి రాగా నీటిలో గడుతు వున్న గణేష్ గల్లంతయ్యాడు. కాగా మంగళవారం ఉదయం పోలీసులు జాలర్ల సహాయంతో ఆనకట్ట వద్ద నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో గణేష్ మృతదేహం బయటపడింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

నాసిరకం మొక్కలతో నష్టపోయిన రైతులు



నాసిరకం అరటి చెట్ల వద్ద బాధిత రైతులు

వేంపల్లె : జిల్లా వ్యాప్తంగా కేఎఫ్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నాసిరకం అరటి మొక్కలను విక్రయించి మోసం చేసిందని, ఆ కంపెనీ మీద చర్యలు తీసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బాధిత రైతులు మీడియాతో మాట్లాడారు. 2022 జూన్‌లో వైఎస్‌ఆర్ జిల్లాలో చాలా మంది రైతులు ఈ మొక్కలు కొనుగోలు చేసి అరటి పంటను సాగు చేశారని తెలిపారు. అవి ఆరు నెలల మొక్కల తర్వాత నాసిరకపు మొక్కలను డీసీ చెట్లు అని పులివెందులకు చెందిన హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్నతాధికారులు తేల్చేసి రిపోర్ట్ కూడా ఇచ్చారని తెలిపారు. కంపెనీ మీద వినియోగదారుల ఫోరంను జిల్లా కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా పులివెందుల నియోకవర్గంలో 2 లక్షల నాసిరకం మొక్కలు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెలో చాలా మంది రైతులు కొనుగోలు చేశారన్నారు. రైతులకు న్యాయం చేస్తామని కంపెనీ హామీ ఇవ్వడం జరిగిందని, అయితే ఇప్పటి వరకు ఏ రైతుకు నష్టపరిహారం కానీ, న్యాయం కానీ చేయకపోవడమే కాక పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఈ ఏడాది అరటి రేటు టన్ను రూ.30 వేల వరకు రికార్డు స్థాయిలో పలికిందని.. ఈ నాసిరకం మొక్కల వలన రైతులు చాలా నష్టపోయారని తెలిపారు. కావున వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆ కంపెనీ లైసెన్స్‌లు రద్దు చేసి, మన రాష్ట్రంలో ఆ కంపెనీ మొక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్‌ఆర్ జిల్లాలోనే కాక సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాలోని రాయలచెరువు, ముదిగుబ్బ మండలాల్లో ఈ కంపెనీ మొక్కలను కొనుగోలు చేసి దిగుబడ రాక లబోదిబోమంటున్నారని వివరించారు.

పూర్తి గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, నిర్వాసితులు

కొండాపురం : గండికోట జలాశయం కింద కె.సుగుమంచిపల్లె గ్రామం మొత్తాన్ని ముంపు పరిధిలోకి తీసుకోవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం నిర్వాసితులతో కలిసి కలెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు.

కె.సగుమంచిపల్లెలో మొత్తం 250 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 134 ఇళ్లను ముంపులోకి తీసుకున్నారని, మిగతా 116 ఇళ్లను కూడా తీసుకోవాలన్నారు. కె.సుగుమంచిపల్లె గ్రామానికి శ్మశాన వాటిక లేదన్నారు. పునరావాస సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు. అలాగే గ్రామానికి దత్తాపురం, బుక్కపట్నం, బొమ్మేపల్లె గ్రామాలను చేర్చకుండా కె.సుగుమంచిపల్లె పంచాయతీని వేరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆగస్టు 15వ తేదీ తర్వాత గ్రామాన్ని పరిశీలించేందుకు ఆర్డీఓను పంపిస్తామని, ఈ సమస్యపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ ఎమ్మెల్యేతో చెప్పినట్లు నిర్వాసితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, శ్రీరంగనాథరెడ్డి, నాగుఅమర్‌నాథ్‌రెడ్డి, ఎస్.ఆదినారాయణరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.